**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 27-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు**

**ముఖ్యాంశాలు**

- ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం ఒక ఉద్యమంలా జరిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు.

- సింహాచలం చందనోత్సవంలో సామాన్య భక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తామని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలియజేశారు.

- రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===================

ఏక్ పేడ్ మాకే నామ్ అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమం ఒక ఉద్యమంలా జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన్ కీ బాత్ మనసులోని మాట కార్యక్రమం 121వ సంచికలో భాగంగా ఈరోజు ఆయన ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత సంవత్సరం ప్రారంభించిన ఈ ఉద్యమంలో 140 కోట్ల పైగా మొక్కలను ప్రజలు నాటారని చెప్పారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఇతర దేశాలలో సైతం అమ్మ పేరుతో మొక్కలు నాటారని నరేంద్రమోదీ తెలియజేస్తూ..

(వాయిస్ బైట్...33 సెకన్లు)

అలాగే.. భారతీయ ప్రతిభకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని ప్రధానమంత్రి చెప్పారు. నేటి భారతీయ యువత శాస్త్ర, సాంకేతిక రంగాల ఆవిష్కరణల దిశగా వెళుతుందన్నారు. గతంలో హింసకు, అశాంతికి పేరుగాంచిన చత్తీస్‌గడ్ లోని దంతెవాడలో ఏర్పాటైన విజ్ఞాన కేంద్రం చిన్నారులకు నూతన ఆలోచనా శక్తి కలిగిస్తోందని చెప్పారు. నూతన యంత్రాలను తయారుచేయడం, 3డి ప్రింటింగ్, రోబోటిక్ కార్లు, మరెన్నో నూతన ఆవిష్కరణలను చిన్నారులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలిగిందని వివరించారు.

అదే విధంగా.. ఇటీవల మయన్మార్ లో ఏర్పడిన భూకంపం అనంతరం చేపట్టిన ఆపరేషన్ బ్రహ్మాలో భారతీయ సహాయక బృందాలు అందించిన సేవలకు అక్కడి ప్రజల నుంచి ప్రశంసలు లభించాయని అన్నారు. ఆపద సమయంలో వీరు చేసిన సేవలు అక్కడి ప్రజలకు నూతన జీవితాలను అందించాయని ప్రధానమంత్రి వివరిస్తూ..

(వాయిస్ బైట్...34 సెకన్లు)

===================

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు విజయవాడ ఎస్. కన్వెన్షన్ లో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలలో భాగంగా నిర్వహించిన మేధో సదస్సులో రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం మరింత శక్తివంతంగా ఉండేందుకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అంబేద్కర్ తో అనుబంధం ఉన్న ప్రదేశాలను పంచ తీర్థ పేరుతో అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తి తో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొంటూ...

(వాయిస్ బైట్... 32 సెకన్లు)

అలాగే.. బిజేపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటన విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

===================

విరామం

===================

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవంలో సామాన్య భక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ రోజు స్వామివారిని దర్శించుకున్న హోం మంత్రి, అనంతరం అధికారులతో కలిసి చందనోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లు, క్యూ లైన్లను జిల్లా కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రశాంతంగా దర్శనాలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతరాలయ దర్శనాలు ఉదయం 6 గంటలతో ముగుస్తాయని చెప్పారు. భక్తులను  కొండపైకి తీసుకురావడానికి అవసరమైన బస్సులు సిద్ధం చేశామని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కాగా ఈ నెల 30వ తేదీన చందనోత్సవం జరగనుంది. ఈ ఒక్కరోజు మాత్రమే స్వామివారు నిజరూపంలో దర్శనం ఇస్తారు.

===================

విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు.  ఈ రోజు  ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన గవర్నర్ కు ఏయు ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం ఉపకులపతి కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయ అవసరాలకు సరిపోయే విధంగా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ ఈ సందర్భంగా సూచించారు. తాము రాజభవన్ లో సౌర విద్యుత్ కి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగిస్తున్నామని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతి, భవిష్యత్ ప్రణాళికలను ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ గవర్నర్ కు వివరించారు.

===================

అమరావతి ప్రాంతం తుళ్లూరు మండలంలో వచ్చే నెల 2 న అమరావతి రాజధాని పునర్ నిర్మాణానికి ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగే శంకుస్థాపన కార్యక్రమ ప్రాంగణ ఏర్పాట్లను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సభకు ఆరు జిల్లాల నుండి 4 లక్షల నుండి 6 లక్షల వరకు ప్రజలు హాజరయ్యేందుకు ఆసక్తి

చూపుతున్నారని తెలిపారు. మంగళవారం ఎస్పీజీ సిబ్బంది వచ్చి సభా ప్రదేశాన్ని పరిశీలించి, సూచనలు చేస్తే.. వాటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

====================

పార్వతీపురం మన్యం జిల్లాలో కొత్తగా 1,521 మంది వితంతువులకు జీవిత భాగస్వామి పింఛన్లు మంజూరయ్యాయని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంజూరైన కొత్త పింఛన్లను మే 1వ తేదీన పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా జిల్లాలో 1,39,752 మందికి 59 కోట్ల 72 లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందని, వీటికి అదనంగా 1,521 మంది వితంతువులకు జీవిత భాగస్వామి పింఛన్లు అందిస్తామని కలెక్టర్ చెప్పారు.

====================

ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణ దిశ గానూ, నైరుతి దిశగానూ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని ప్రాంతాలలో కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 30 నుండి 40 కి.మీ. వేగంతో వీస్తాయని, రానున్న ఐదు రోజుల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

====================

====================